# అందం

తోట గేటుపక్క పొదలా పెరిగి వీధివేపుకు కొమ్మలు వాలి ఉంది, పెద్దగన్నేరుచెట్టు. చెట్టునిండా సందులేకుండా ఎఱ్ఱని గన్నేరుపూలు గుత్తులు గుత్తులుగా ఉంటాయి. పూలతో చెట్టు ఎంతో ముచ్చటగా ఉంటుంది. దూరాన్నుంచే అందరినీ ఆకర్షిస్తుంది. ఆదోవన పొయ్యే వాళ్ళందరి కళ్ళు దానిమీదే ఉంటాయి. ఊరికే చూచి ఆనందిస్తూ ఎవరూ అడుగు ముందుకు వెయ్యలేరు. ఒక్కసారి ఎగిరి అందిన కొమ్మ పట్టుకు అందిన పూలగుత్తి కోసుకుంటారు. మళ్ళా ఎవరయినా చూస్తారేమోనని భయంతో పరుగెత్తుతారు. నోరున్న వారైతే మెల్లగానే వెళతారు-చేసిన తప్పు మాటలతో సమర్థించుకోగలమనే ధైర్యంతో!

ఒకరని లేదు. అన్నిరకాల వ్యక్తులు ఆ పువ్వుల కోసం ఆశపడతారు. రోడ్డు వెంబడి అల్లరిగా తిరిగే పిల్లలు, తెల్లవారకముందే కూలీనాలీ చేసుకోటానికి పరుగెత్తే పల్లెవాళ్ళు నీటుగా తయారయి నిదానంగా వెళ్ళే నాగరికులు, పుస్తకాల బరువుతో బడికి వెళ్ళే పిల్లలు, ఒకరేమిటి, ఎవరు వెళితే వారే ఒక్కక్షణం ఆగి, ఒకపూలగుత్తి తీసుకుని మరీ వెళతారు.

అందం చూచి ఆనందించటానికి అందరికీ అధికార ముంది అయితే అది అపహరించటం న్యాయమా? ఆపూలు కోస్తున్నప్పుడు ఎవరికీ అపహరిస్తున్నామని, అందమైన చెట్టును అందవికారంగా చేస్తున్నామని ఆలోచనే వుండదు. కొందరు పువ్వులు దేవుని కోసం అంటారు. దేవునికి దొంగి లించిన పువ్వులే కావాలేమో!

తోట వాకిలికి ఇంటికి మధ్య వందగజాల ఎడం వుంది. వాకిట్లో అలికిడి విని మాలతి పరుగెత్తుకు వచ్చే లోపల ఎవరూ ఉండరు. ఒకవేళ ఉన్నా మాలతి మందలింపు వాళ్ళకు పరిహాసంగా ఉంటుంది. అందమైన పూలను అపహరించడం వాళ్ళ జన్మహక్కు అన్నట్లుగా ఉంటుంది వారి ప్రవర్తన. కొమ్మలు విరిగి నిస్సహాయంగా ఉన్న గన్నేరుచెట్టు మాలతికేసి జాలిగా చూస్తుంది.

ఆ ఇంట్లో మాలతి, భర్త ఆనందరావు, పాప, పని మనిషి శేషమ్మ మాత్రమే ఉన్నారు. పదిగంటలకల్లా మాలతి తప్ప అందరూ వెళ్ళిపోతారు. ఆనందరావు ఆఫీసుకు వెళతాడు. పాప బడికి వెళుతుంది. పాపతో కూడా శేషమ్మ వెళుతుంది. మళ్ళీ సాయంత్రం పాపను తీసుకు వస్తుంది. ఇల్లు ఊరికి చాలా దూరం. అందునించి మధ్యలో ఎవరూ రారు.

మధ్యాహ్నం మాలతి తోటలో చెట్లదగ్గర కూర్చుని అల్లుకుంటూ ఉంటుంది. ఒకవిధంగా తోటకు కాపలా కాస్తుంది. అదేమి సవ్యంగా పెంచిన తోటకాదు. ఒకవేపు

పొదలా పెరిగిన గన్నేరుచెట్లు, మరోవేపు మామిడిచెట్లు పనసచెట్లు, ఇంకోవేపు అడవిలా అరటిమొక్కలు! గాలికి ఆకులు తోటంతా రాలివుంటాయి.

ఆ తోటంతా బాగుచెయ్యటానికి శేషమ్మకు తీరిక లేదు మాలతికి ఓపికలేదు. ఆ ఎండుటాకుల కుప్పలమీదే కూర్చుని కాలం గడుపుతుంది. ఆ తోటకు ఏం చెయ్యాలన్నా మాలతికి నిరుత్సాహం! ఆ తోటలో పూలు పళ్ళు తమవికావు! అవన్నీ నేర్పుగా అపహరించటానికి ఓపిక వున్న వాళ్ళవి ఆ తోటకు సరైన ప్రహరీగోడ కూడా లేదు. చుట్టూ ముళ్ళతీగ మాత్రం ఉంది. అదైనా ఎత్తుగా లేదు. ఇంక తోటకు ఏం చేసి ఏం లాభం!

కొమ్మలు విరిగి జాలిగా చూచిన గన్నేరుచెట్టు మాలతి మనసులో ముల్లులా గుచ్చుకుంది. అందాన్ని చూచి ఆనందించవచ్చుగాని ఇలా పాడు చెయ్యడమేమిటి! అందంగా వున్న పసిపాప ముద్దొస్తుంది. మురిపెంగా ఒక్క క్షణం పలకరించవచ్చు ఆపాప ఏడుస్తున్నా ఎత్తుకుని నలపడం ఎఱ్ఱబడేట్లు బుగ్గలు గిల్లడం ఏం మురిపెం! ఈ పుష్పాలు కోసుకుంటున్న వాళ్ళందరికీ నిజంగా అవి కావాలా? కాసేపు ఆ పుష్పాలు పట్టుకోవాలి! తమవి అనుకోవాలి! ఆ తరువాత అవి ఏమైనా ఫరవాలేదు! ఇంక అవి తమకక్కరలేదు, దూరాన్నుంచి చూచి ఆనందించడంలో తృప్తి లేదు. అందమైన వస్తువు ఒక్కక్షణం తమ సొంతం కావాలి! ఆ ప్రయత్నంలో అది అందవికారంగా మారినా సరే! అవి

మానవ ప్రకృతి! అందుకే ఈ లోకంలో ఏ అందమూ లేకుండా ఉండటమే మంచిదేమో!

మాలతికి ఆ క్రిందటిరోజు మహిళా మండలిలో జరిగిన సంభాషణ గుర్తువచ్చింది. ఆ వూరికొక లేడీస్ క్లబ్ వాళ్ళింటి దగ్గరగానే ఉంది. ఎప్పుడైనా నెలకొకసారి అక్కడ ఓ సమావేశం జరుగుతూ ఉంటుంది. ఆ క్లబ్ లో సభ్యులు పదిమందికన్నా లేరు. అందులోను సగంమంది మాత్రమే సమావేశాలకు హాజరవుతూ ఉంటారు. ఎప్పుడయినా కాలక్షేపానికి మాలతి అక్కడికి వెళుతుంది.

ఆ క్లబ్ చుట్టూ మంచి లాన్ ఉంది. అక్కడ ఆడుకోటం పాపకు సరదా! అంచేత పాపకోసం కూడా కొంత వెళ్లటం అలవాటు చేసుకుంది. సమావేశానికి వెళ్ళినప్పుడల్లా ఊళ్ళోకి కొత్తగా వచ్చిన చీరలు నెక్లెసుల వివరాలతో పాటు ఊళ్ళో గాలికబుర్లు కూడా కొంత తెలుసుకోవచ్చు.

ఆ వూరుకు కొత్తగా బదిలీ అయివచ్చిన సబ్ కలెక్టరుకు కొత్తగా పెళ్లయింది. నిన్నటి సమావేశంలో కలక్టరు గారి భార్యను గురించి కొంతసేపు సంభాషణ సాగింది. క్లబ్ మెంబర్ సౌభాగ్యమ్మ సంభాషణ ప్రారంభించింది. "మన కలక్టరు చంద్రశేఖరంగారికి పెళ్ళయిందిట గదా! విన్నారా!" అంది.

"ఆ! నేను పెళ్ళికి వెళ్ళాను" అంది శ్యామల.

"పాపం! ఆవిడ ఏమీ అందంగా ఉండదట గదా!" అంది సుకన్య.

మాలతికి కలక్టరుగారి కొత్త భార్య కుముదం మనసులో మెదిలింది, ఆవిడను తనూ చూచింది. నిజానికి ఆవిడ అందంగా ఉండదు. పొట్టిగా లావుగా చామనచాయగా ఉంటుంది. ముఖవర్చస్సు కూడా అంతగా ఆకర్షణీయంగా ఉండదు. అయితే మనిషి చూడగానే నిరాడంబరంగా చాలా మంచి మనిషి అనిపిస్తుంది.

"ఎవర్ని చేసుకుంటాడో అని అంతా ఆత్రంగా ఎదురుచూస్తోఉంటే చివరకు ఏ అందమూ లేని ఆ కుముదాన్ని చేసుకున్నాడు," అంది సౌభాగ్యమ్మ బాధగా. ఆవిడకు ఎదిగిన కూతురు ఉంది. ఆ పిల్లను చేసుకుంటాడేమోనని ఆవిడ కొన్నాళ్ళు ఆశపడ్డది. అది కుదరలేదు. అందుకే అందరికన్న ఆవిడకు కొంచెం ఎక్కువ బాధగావుంది, కలక్టరుగారు వెళ్ళివెళ్ళి ఒక అనాకారిదాన్ని చేసుకోడం.

మాలతి మాటలు కల్పించుకుంది. "మనకేం తెలుస్తుంది. ఆవిడలో ఆయనకేమైనా అంత సౌందర్యం కనిపించిందేమో" అన్నది, ఏదో అనాలిగదా అని. "ఆ! అదేం లేదు. ఆవిడకు లక్షరూపాయలు ఆస్తివుంది. అది కనిపించింది" అంది సౌభాగ్యమ్మ ఈసడింపుగా. "మనం ఆవిడను మన క్లబ్బుకు ఆహ్వానించాలి ఒకసారి. టీపార్టీ ఏర్పాటు

చెయ్యాలి" అంది శ్యామల. "అవును" అంది సుకన్య. అంతటితో ఆ సంభాషణ ఆగిపోయింది. మళ్ళా కొత్తగా వచ్చిన కాశ్మీరు చీరల ధరలను గురించి సంభాషణ ప్రారంభమైంది.

కాని ఆ చర్చ కొంతసేపు మాలతి మనసులో మెదిలింది కుముదం. అందంగా లేకపోతేనేమి? ఆవిడ భర్త చంద్రశేఖరం కంటికి ఆవిడ అందంగావుంది ఆవిడ అందగత్తె కాదని తెలిసే అతను పెళ్ళిచేసుకున్నాడు. అంచేత ఇంక అసంతృప్తి ఉండదు. కొన్నాళ్ళకు విరక్తి చెందడం, ఆ అందం అందర్నీ ఆకర్షిస్తుందేమోనని అపహాయపడటం వుండవు! ఆ స్త్రీమూసి చేసుకుంటే మాత్రమేమి! డబ్బువిలువ తెలిసిన మనిషి, భార్యలో అందంకోరని మనిషి సుఖపడతాడు. గాలిలో మేడలు కట్టుకుండా నేలమీద తృప్తిగా బ్రతుకుతాడు.

చాలా అందంగాఉండి తను ఏం సుఖపడింది? బ్రతుకంతా భయం భయంగా గడిపింది. పసిపిల్లప్పటినుంచి అందరూ తను అందంగావుందని మెచ్చుకున్నారు. అలా అందరూ మురిపెంగా చూడటం తనకు భాధాకరమేఅయింది. చిన్నప్పుడు అందరూ తన్ను ఎత్తుకుని ముద్దులాడేవారు. ఊపిరాడనట్లుగా నలిపేసేవాళ్ళు. తమ ఇంటికివచ్చే బంధువర్గంలోని మగవాళ్ళు, స్నేహితులు! వాళ్ళను చూస్తేనే తనకు భయంగా ఉండేది. వాళ్ళు ఎత్తుకుని ముద్దులాడుతూ ఉంటె ఏమిటో చీదరగా ఉండేది. అందుకే ఎవరయినా

ఇంటికి రాగానే భయపడి అమ్మదగ్గరకు పారిపోయ్యేది. వాళ్లు వెళ్ళిపోయ్యేవరకు అమ్మ వెనకాలే ఒదిగి కూర్చునేది. అమ్మ ఒక్కోసారి విసుక్కున్నా అక్కడినుంచి కదిలేది కాదు. పసితనమంతా అలా భయం భయంగా గడచింది.

కొంచెం పెద్దయి బడికి వెళుతోన్నా ఆ భయం పోలేదు. ఇంకా ఎక్కువయింది. తను రోడ్డుమీద పోతూ ఉంటే ఎవళ్ళో ఒకళ్ళు వయసొచ్చిన మగవాళ్లే తననుచూసి వెనకాలే వెంటపడి రావడం, తాను భయపడి ప్రాణాలు బిగపట్టుకుని పారిపోవడమూ జరిగేది. రానురాను తనకు వీధిలోకి అడుగుపెట్టాలంటేనే భయం వేసేది. కొన్నాళ్ళకి స్కూలుకికూడా పోనని మారాంచేసి ఇంట్లోనే ఉండిపోయింది. కొంత వయసొచ్చాక ఇంట్లోకూడా తనకి స్వేచ్ఛ లేదని తెలిసింది. తమ ఇంటి కెదురుగావున్న ఇంట్లో ఒక వయసొచ్చిన ప్లీడరుగా రుండేవారు. ఆయనకు అరడజను మంది పిల్లలున్నారు. అయినా తను వీధి వసారాలోకి వచ్చినా, తోటలోకి వచ్చినా ఆయన అదేపనిగా తన్ను చూస్తూ ఉండేవాడు. ఆ చూపులు ఆయన్ను చూసేసరికి తనకు మళ్ళా భయం పట్టుకుంది. ఆయనకంట పడకుండా ఉండాలని తోటలోకి, వీధివసారాలోకి రావటం మానుకుంది. ఎంతసేపు లోపల గదుల్లోనో అమ్మదగ్గరో, పిన్ని దగ్గరో మసలుతూ ఉండేది. ఇలా అందరిని ఆకర్షించగలిగిన అందం తనకు బంధనం అయింది. బ్రతుకు చెరసాలఅయింది.

ఒకరోజు అమ్మ సంతోషంతో తనతో చెప్పింది. "అదృష్టం నిన్ను వరించింది. జడ్జీగారబ్బాయి ఆనందరావు నిన్ను చూశాడుట. నిన్నే పెళ్ళి చేసుకుంటానన్నాడట. జడ్జీగారు కబురుచేస్తే మీ నాన్న వెళ్ళి మాట్లాడివచ్చారు, కట్నాలు అవీ మాకు పట్టింపులేను, పెళ్లిమాత్రం ఘనంగా జరిపించాలన్నారుట. జడ్జీగారి భార్య కమలమ్మ ఇదివరకే నాతో అప్పుడప్పుడూ సరదాగా అంటూఉండేది, "మీపిల్ల అందంగా ఉంటుంది, మా కోడల్ని చేసుకుంటాము" అని. "నిజంగా ఇలా కలిసివస్తుం దనుకోలేను" అంది.

పదిరోజుల కిందట తాను జడ్జీగారింటికి అమ్మతో పేరంటానికి వెళ్లింది. కాని వెళ్లేటప్పుడు వచ్చేటప్పుడు తాను ఎవరినీ చూడలేదు. తలవంచుకు అమ్మతోకూడా వెళ్లింది. అలానే తిరిగి వచ్చింది. ఆ ఆనందరావు ఎవరో, ఎలా ఉంటాడో తనకు తెలియదు, అతని తండ్రికి ఆస్తివుంది, అధికారంవుంది. అంచేత మంచి సంబంధమే! ఆరునెల్లో తనకు ఆనందరావుతో పెళ్లయింది. ఆ తరువాత కొన్నాళ్లు తనకు కొంత స్వేచ్ఛ వచ్చినట్లనిపించింది. భర్తతో కలసి ఎక్కడికైనా వెళ్లడానికి తనకు అంతగా భయం ఉండేదికాదు. ఇంట్లో స్వేచ్ఛగా మసలడానికికూడా భయం ఉండేదికాదు. కాని కొన్నాళ్లకు భర్తతో కలసి ఎక్కడికైనా వెళ్లడానికి ఉత్సాహం తగ్గిపోయింది. అందాన్నిమాత్రమే చూసి వరించి నప్పుడు కొన్నాళ్ళకు మోజు తగ్గుతుంది. ఏదైనా ఒక

వస్తువు దూరంగా ఉన్నంతసేపు దానికోసం తపన! ఆవస్తువు నాది. ఇంక నన్ను వదలి పోదు అనుకున్నాక ఒక విధమైన నిర్లిప్తత! సౌందర్యంకోసం తపించేవాళ్ళు సంతృప్తిపొందరు. అందం కోసం అన్వేషణ సాగుతూనేఉంటుంది. అందానికి విలాసానికి ఆశపడేవాడు కర్తవ్యానికి కట్టుబడినవాడిలా తృప్తిగా బ్రతకలేడు.

ఆనందరావు చపలుడు. అతను కనిపించిన ప్రతి ఆడదాన్నిగురించి ఏదో ఒక వ్యాఖ్యానం చేసేవాడు. అతను మరొక స్త్రీని మెచ్చుకున్నా, పరిహసించినా రెండూ మాలతికి బాధకలిగించేవి. పైగా అందరూ తనలాంటి వాళ్ళేనని అతని ఊహ. మాలతిని ఊరికే ఒత్తిడి చేసేవాడు. "వెనక చీరకొంగు సరిగా కప్పుకో. అందరూ నీ జడవంకే చూస్తున్నారు" "తలనిండా అన్ని పువ్వులెందుకు? అందరూ చూడాలనా?" అలా ఏదో ఒక మొరటువాక్యం అంటూ ఉండేవాడు. ఇతర స్త్రీలనుగురించి అతనుచేసే వ్యాఖ్యానాలు వినలేక, అతని ఒత్తిడి పడలేక క్రమంగా ఉత్సాహం చచ్చిపోయింది. తను క్రమంగా అతనితోకూడా వెళ్ళడమే మానుకుంది, అతనూ బలవంతపెట్టలేదు. బయట స్నేహితులతో తిరగడమే అతనికి స్వేచ్ఛగావుంది. తను నాలుగు గోడలమధ్య మళ్ళా బంధనంలో చిక్కుకుంది. కొన్నాళ్ళకు పాప పుట్టింది. అంతటితో జీవితం గమ్యం చేరుకుంది. ఇప్పుడు అన్ని ఆలోచనలు అన్ని పనులు పాపను చుట్టుకునే ఉంటాయి. అంచేత తనకు ఒంటరితనం లేదు. బ్రతుకు బంధ

నమూ అనిపించదు. ఏడాదిగా పాప బడికి వెళుతోంది. అది సాయంత్రం తిరిగివచ్చేవరకు తనకు ప్రాణాలు కొట్టుకుంటాయి. విచిత్రంగా పాపకూడా చాలా అందంగా ఉంటుంది. తన కంటికేకాదు అందరూ అలానే అంటారు. అందుకే అది ఇంటికి తిరిగివచ్చేవరకూ తనకు భయం.

ఆవేళ పాప కొంచెం ఆలస్యంగా వచ్చింది. మాలతి ఎదురుచూస్తూ తోట గేటుదగ్గరే వుంది. పాప బుగ్గమీద అర్ధచంద్రాకారంగా ఎర్రగా రక్తంచిమ్మి గోరు దిగబడిన గుర్తువుంది. మాలతి భయపడింది, "బుగ్గమీద అదేమిటి? ఎవరు గిచ్చారు? ఎవరితోనైనా పోట్లాడావా?" అంది. పాప తెల్లబోయింది. "నీ కప్పుడే ఎవరు చెప్పారు" అంది అమాయకంగా. మాలతి నవ్వింది. "నీ మొహం! ఎవరు చెప్పేదేమిటి! బుగ్గమీద కనబడుతోంటే" అన్నది. పాప సిగ్గుపడింది. శేషమ్మ అందుకుని చెప్పింది "ఎవరో పక్క హైస్కూలు కుర్రవాడట. పాప ముద్దొస్తోందని గిల్లాడట" అంది. "ఏడిసినట్టుంది. ముద్దొస్తోందని రక్తంవచ్చేటట్లు గిల్లడమా! ఏం రాక్షసత్వం. అందంగా ఉండటం పాపచేసిన తప్పా" అనుకుంది. అయినా ఎవరినని ఏం లాభం! మానవ ప్రకృతి మారదు. మౌనంగా భరించడంకంటె చేసేదేముంది?

పాపకు నీళ్ళుపోసి తను స్నానంచేసి తలనిండా మల్లెపూవులు పెట్టుకుని తెల్లనిచీర కట్టుకుంది. పాపకు గౌను వేయలేదు. డ్రాయరు మాత్రం వేసింది. వేసంకాలం అప్పుడే ఉక్కపోస్తోంది. చాపమీద కూర్చొని పాపకు పాటలు నేర్పు

తోంది. తెల్లగా బొద్దుగా పాప ముద్దొస్తోంది, చెంపమీద గిల్లిన చారకూడా అందంగా కనిపిస్తోంది. నఖక్షతాలని వర్ణన ఎప్పుడో చదివింది. చూడలేదు పసిపాప బుగ్గమీద వర్ణనకు సరిపోయ్యే గుర్తు చూసి నవ్వుకుంది. ఒక్క క్షణం పాపతో చెప్పాలనిపించింది. "ఎవరైనా గిల్లితే ఊరుకోవద్దు. అరచి కేకలువెయ్యి. మళ్ళా గిల్లు! మేష్టరుతో చెప్పి కొట్టిస్తానని బెదిరించు" అని. మళ్ళా క్షణంలో అది తప్పని తోచింది. అలాచేస్తే ఇంక పాప అందంగా వుండదు. అందరిలాగే మొరటుగా వుంటుంది. రాక్షసత్వాన్ని జయించటానికి రాక్షసత్వం నేర్చుకోకూడదు.

రాత్రి ఎనిమిది గంటలకు ఆనందరావు ఇంటికి వచ్చాడు. తెల్లనిచీరతో మాలతి, తెల్లని డ్రాయరుతో పాప అందంగా వున్నారు. అతను సంతోషంగా నవ్వాడు. కుర్చీలో కూర్చుని పాపను ఒళ్ళోకి తీసుకున్నాడు. పాప నవ్వుతో కబుర్లు చెప్తోంది. అతని దృష్టి పాప బుగ్గమీద పడింది. అంతలో అతనికి కోపం వచ్చింది. "ఏమిటే, ఎవరు గిల్లారు ఇలా మొరటుగా?" అన్నాడు. పాప తెల్లపోయింది, మాలతి జరిగింది చెప్పింది. అతని ముఖం కోపంతో ఎర్రబడింది. కోపంతో అన్నాడు. "అదేమిటి! ముద్దొస్తే అలా మొరటుగా గిల్లడమూ! ఉండు రేపు హెడ్మాష్టరుతో చెప్తాను" అన్నాడు. మాలతి నవ్వింది, "బావుంది ఆ పిల్లవాడెవరో, అతని పేరేమిటో, ఏ క్లాసో పాపకు తెలీదు. ఏమని చెప్తాడు" అంది. ఆనందరావు ముఖం చిట్లించుకున్నాడు.

అంతలో వీధివేపునుంచి శేషమ్మ కేకలు వినిపించాయి. ఎవరో గన్నేరుపూలు కోసుకు పరుగెడుతున్నారు కాబోలు! మాలతి నవ్వుకుంది. పువ్వులు దొంగిలించకుండా ఎవరిని శేషమ్మ ఆపలేదు. పాపబుగ్గ గిల్లకుండా ఎవరిని ఆనందరావు ఆపలేదు. కాకపోతే ఇద్దరూ అరచి నవ్వుల పాలవుతారు. అందంగా వుండడం పువ్వులుచేసిన పాపం! ముద్దుగా ఉండడం పాపచేసిన తప్పు!

తండ్రిఒడిలో కూర్చుని అమాయకంగా ఉన్న పాప అందంగా మెరసిపోతోంది. ఆ పాపనుచూసి మాలతి మురిసిపోయింది.